ప్రజాశక్తి

సోమవారం 2 జూన్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

'ఉత్తర దక్షిణల' కే ప్రాధాన్యం

ప్రజాప్రతినిధుల చుట్టూ ఉద్యోగులు, అధికారుల ప్రదక్షిణాలు

వివిధ స్థాయిల్లో భారీగా ముడుపుల ఆరోపణలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలలో సిఫార్సులు, ముడుపుల బాగోతం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగుల బదిలీలపై మే 15వ తేదీన ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. మే 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. ఆయా శాఖల బదిలీల్లో అర్హతలపై మార్గదర్శకాలను విడుదల చేయగా కొన్ని చోట్ల అందుకు భిన్నంగా కొత్త కారణాలను చూపి బదిలీలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. బదిలీలకు సంబంధించిన ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల్లో ఒకే చోట ఐదేళ్ల పూర్తి అయిన ఉద్యోగులను ఖచ్చితంగా బదిలీ చేయాలని ఆదేశించింది. పదోన్నతి పొంది ఒకే ప్రాంతంలో ఐదేళ్ల పూర్తి చేసిన వారిని బదిలీ చేయాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది మే 31వ తేదీలోపు రిటైర్‌మెంట్ అయ్యే ఉద్యోగులకు బదిలీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అంధులైన ఉద్యోగులకు బదిలీల్లో ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది. మానసిక రుగ్మత ఉన్న పిల్లల తల్లిదండ్రులకు వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని

నిర్ణయించారు. మెడికల్ గ్రౌండ్‌లో భాగంగా ఉద్యోగుల వినతి మేరకు బదిలికి అవకాశం కల్పించారు. దీంతో ఎక్కువమంది మెడికల్ ధృవపత్రాలతో బదిలీ కోరుకుంటున్నారు. వితంతు ఉద్యోగుల వినతి మేరకు బదిలీల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే భార్యభర్తలు ఉద్యోగులకు బదిలీల్లో ఒకే చోట లేదా దగ్గరి ప్రాంతాల్లో బదిలీ చేసేలా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అయితే ఐదేళ్లు దాటిన వారు జిల్లా కేంద్రంలోనే ఒక విభాగం నుంచి మరో విభాగంకు వెళ్లేలా సిఫార్సులు చేయించుకుంటున్నారు. బదిలీ అనివార్యం అయిన వారు వెంటనే ప్రజా ప్రతినిధులను, ఇతర ఉన్నతాధికారులను కలిసి సిఫార్సులు చేయించుకుంటున్నారు. సిఫార్సు లకు కొంత మంది ధరలు నిర్ణయి స్తున్నారు. సిఫార్సు చేయించుకున్న వారు ఆర్థికంగా, రాజకీయంగా బలవంతులు అయితే బదిలీకి అర్హత లేని వారిని కూడా బదిలీ చేయించి స్థానంలోకి వీరు వస్తున్నారు. జిల్లాకేంద్రంలో పనిచేసే వారు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. వ్యవసాయ శాఖలో బదిలీల ప్రక్రియ తీవ్ర వివాదస్పదం అయింది. మంగళగిరిలోని వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయంలోని ఇద్దరు

2లో

ప్రశాంతంగా డిపోల్లో రేషన్ పంపిణీ

వసంతరాయపురంలో చౌకధరల దుకాణాన్ని పున:ప్రారంభించిన ఇన్‌చార్జి కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆదివారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చౌకడిపోల్లో రేషన్ పంపిణీ ప్రశాంతంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గుంటూరులో ఆదివారం తూర్పు నియోజకవర్గ పరిధిలో వసంతరాయపురంలోని చౌకధరల దుకాణం నెం.61ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ.భార్గవతేజ పున్ణప్రారంభించి, ప్రసంగించారు. చౌక ధరల దుకాణాలలో ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రైస్ కార్డుదారులు వీలున్నప్పుడు నిత్యావసర సరుకులు తెచ్చుకునే అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవతేజ తెలిపారు. రైస్‌కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ.భార్గవతేజ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుంచి రైస్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు చౌకధరల దుకాణాల నుంచి పంపిణీ చేయడం పున్ణ ప్రారంభించడం జరుగుతుందన్నారు. చౌక ధర దుకాణంలో ప్రతినెల 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రైస్‌కార్డుదారులకు నిత్యావసర సరుకులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైస్ కార్డుదారులు వారికి వీలున్న సమయంలో చౌక ధరల దుకాణంకి వచ్చి సరుకులను తీసుకువెళ్ళ వచ్చు అన్నారు. చౌకధరల దుకాణాల్లో నిత్యావసర

2లో

సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ఎస్ భారవి

గుంటూరు కార్పొరేషన్‌లో ప్రజలపై

రూ.32 కోట్ల అదనపు భారం

- పట్టణ ప్రజలపై పన్నుల భారం ఉపసంహరించుకోవాలి

- ముక్తకంఠంతో పౌర సంఘాల డిమాండ్

ప్రజాశక్తి -గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించి పట్టణ ప్రజలపై భారాలు మోపుతుందని పౌర సంఘాలు విమర్శించాయి. రాష్ట్రంలోని పట్టణ ప్రజల ద్వారా రూ.463.93 కోట్లు అదనపు పన్ను వసూళ్ల లక్ష్యంగా ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఫాక్వా) ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన పట్టణాల్లో పన్నుల వసూళ్లకు సంబంధించిన విడుదల చేసిన ఉత్తర్వులపై స్థానిక బ్రాడీపేటలోని బాలానందకేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ఫాక్వా కన్వీనర్ ఎల్.ఎస్.భారవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత ప్రభుత్వం అద్దె విలువ ఆధారిత పన్ను విధానం రద్దు చేసి, ఆస్థి విలువ ఆధారిత పన్ను విధానం తీసుకొచ్చిందన్నారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేశామన్నారు. అప్పట్లో ప్రతిపక్ష టిడిపి తాము అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని పున:సమీక్షిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఉంచిందన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాన పున:సమీక్షించకపోగా ఇప్పుడు వసూలు చేస్తున్న పన్నులపై 20 శాతం అదనంగా పన్నులు వసూలు చేయాలని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. దీని ద్వారా గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలపై రూ.32 కోట్ల అదనపు పన్ను భారం పడనుందని చెప్పారు. పౌర సంక్షేమ సంఘం నాయకులు కె.నళినీకాంత్ మాట్లాడుతూ ప్లాన్ లేని భవనాలు, ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాల నుండి అదనపు పన్ను వసూలు చేస్తామని ప్రభుత్వం చెబుతుందని, ఎన్ని అసెస్‌మెంట్లు ఉన్నాయో లెక్క తేలకుండా ముందుగానే జిఎంసికి రూ.32 కోట్లు లక్ష్యంగా ఎలా నిర్దేశించారని ప్రశ్నించారు. ప్రభుత్వం చెబుతుందని ఆవాస్తవం అని, అందరికీ అదనపు భారం పడబోతుందన్నారు. ప్లాన్‌కు భిన్నంగా నిర్మించిన భవనాలకు కనీసంగా 25 శాతం నుండి వంద శాతం వరకూ అదనపు భారం

2లో



మానసిక వ్యాధుల్ని సకాలంలో గుర్తించాలి

ప్రజాశక్తి-గుంటూరు

శారీరక సమస్యలతోపాటు, మానసిక సమస్యలను కూడా సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. అవగాహన ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ స్కీజోఫ్రేనియా దినోత్సవం సందర్భంగా అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సభలో డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జీవన శైలి, సామాజిక పరిస్థితుల వల్ల మానసిక ఒత్తిడులకు గురవుతున్నారని, దాని వల్ల అనేక మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, అందులో ముఖ్యమైనది స్కిజోఫ్రేనియా అని తెలిపారు. ఈవ్యాధితో బాధపడే వ్యక్తులు ఏది నిజమో..? ఏది కాదు అనే తేడాను గుర్తించడంలో ఇబ్బంది పడుతుంటారని తెలిపారు. ఇది ఒక మానసిక రుగ్మత అని తెలిపారు. ఈ వ్యాధి ఉన్న వారు భ్రమలలో ఉంటూ, ప్రతిదీ అనుమానిస్తూ, చుట్టుపక్కల వారు తమను ఏదో చేస్తారని భావిస్తూ ఉంటారన్నారు. ఈవ్యాధికి మందుల ద్వారా మాత్రమే వైద్యం ఉందని, కౌన్సిలింగ్ ద్వారా నయం అయ్యే అవకాశం ఉండదని చెప్పారు. మెదడులో డోపమిన్ హార్మోన్ ఉత్పత్తి ఎక్కువైతే ఈవ్యాధి వస్తుందని, ఇది మొదటి సారి వచ్చిన సందర్భంలో కనీసం రెండు సంవత్సరాలు మందులు వాడుకోవాల్సి వస్తుందని, ఒకవేళ రెండవసారి వచ్చిన వారిలో మూడు నుండి ఐదు సంవత్సరములు మందులను వాడవలసి వస్తుందని, మూడోసారి వచ్చిన వారిలో అయితే ఈ వ్యాధికి వారు బతికున్నంత వరకు మందులు వాడవలసి వస్తుందన్నారు. కావున సకాలంలో మానసకి వ్యాధుల్ని గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. కాటూరి వైద్య కళాశాల డాక్టర్ ఎన్ సంజయ్ మాట్లాడుతూ పెద్దవారిలో ఎక్కువగా కనపడే మరొక మానసిక సమస్య అల్జిమర్స్ అని తెలిపారు. ఇది సాధారణంగా 60 సంవత్సరములు పైబడిన వారిలో కనబడుతుందన్నారు. ఈసమస్యకు గురైన వారు మొదటి దశలో చిన్నచిన్న విషయాలు, కొద్ది గంటల క్రితం చేసిన, అనుకున్న విషయాలు మర్చిపోతారన్నారు. రెండవ దశలో కొన్ని రోజులు ముందట జరిగిన విషయాలు మరిచిపోతారని, ఇక చివరి దశలో సంవత్సరముల క్రిందటివి కూడా మరిచిపోయే ప్రమాదం ఉందన్నారు. షుగర్, బిపి ఉన్నవారికి అల్జిమర్స్ సమస్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నదని,అనంతరం పార్కిన్‌సన్స్ సమస్య గురించి వివరించారు. ఈ సభకు కోఆర్డినేటర్ గా టీ.వీ .సాయిరాం వ్యవహరించగా, ప్రభుత్వ విశ్రాంత అధికారి తిరుమలరావు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌కుమార్

బంగారపు బట్టీ నిర్వాహకుడు ఆత్మహత్య

- దొంగతనం కేసులో విచారణ నిమిత్తం స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు

- విచారణ పేరిట వేధింపులే కారణమంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి తెనాలి

తెనాలిలో పోలీసుల వైఖరి సర్వత్రా విమర్శనీయంగా మారుతుంది. ఇటీవల ఓ కేసులో నిందితులైన ఇరువురు దళితులు, ఓ మైనారిటీ యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఇంకా బర్నింగ్ టాపిక్ గానే ఉంది. అది చాలదన్నట్లు మరో కేసులో నిందితుడిని విచారణ పేరిట స్టేషన్కు పిలిపించి అవమానకరంగా ప్రవర్తించడంతో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. తెనాలి గంగానమ్మపేటలోని పాత శివాలయం సమీపంలోని ఓ జ్యుయలరీ షోరూమ్‌లో స్టాక్ మేనేజర్‌గా ఐదేళ్లుగా పని చేస్తున్న అనిల్‌కుమార్‌జైన్ చౌదరి మే 14వ తేదీన కనబడకుండా పోయాడు. అతని అన్న వినోద్‌కుమార్ జైన్ తన సోదరుడు కనబడడంలేదని ఫిర్యాదు చేయగా టూ టౌన్ పోలీసులు 15వ తేదీన కేసు నమోదు చేశారు. 14న షోరూమ్‌కు అనిల్‌కుమార్ జైన్ రాకపోవడంతో అనుమానం వచ్చి, షాపులో స్టాకును పరిశీలించుకున్న షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ బన్సాలీ రమేష్ కుమార్ ముత్తా 1509 గ్రాముల బంగారు అదశ్యమైనట్లు గుర్తించారు. ఆ సొత్తు విలువ రూ. 1.45 కోట్లు ఉంటుందని, తమకు న్యాయం చేయాలని రమేష్ కుమార్ ముత్తా మే 22న పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ సీఐ రాముల నాయక్ కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు విచారణను త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబుకు అప్పగించారు. ఈ నేపథ్యంలో విచారణ పేరిట తెనాలిలో బంగారం భట్టీ నిర్వహించే మహారాష్ట్రకు చెందిన సిద్దేష్ శివాజీ ఘోర్పడే(35)ను త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు శనివారం పిలిపించారు. అపహరణకు గురైన బంగారానికి సంబంధించి దాదాపు 100 గ్రాముల బంగారాన్ని సిద్దేష్ శివాజీకి విక్రయించినట్లు పోలీసులకు సమాచారం రావడంతో, విచారణకు స్టేషన్కు పిలిపించినట్లం సమాచారం. అదే సమయంలో అతనిని వేధింపులకు గురి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పోలీసుల ఒత్తిడిని తట్టుకోలేక సిద్దేష్ శివాజి ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వేధింపులతోనే అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇటీవల సర్వత్రా విమర్శలు ఎదుర్కొన్న త్రీ టౌన్, టూ టౌన్ సిఐలు మరో వివాదంలో చిక్కుకున్నట్లు అయ్యింది. ఈ వివాదం ఎటు దారితీస్తుందో వేచి చూడాల్సిందే. దీనిపై వివరణ కోరెందుకు త్రీ టౌన్ సిఐ ఎస్ రమేష్ బాబు కు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఆత్మహత్యకు పాల్పడిన సిద్దేష్ శివాజీ(ఫైల్ ఫోటో)

సిఐటియు చొరవతో నిర్మాణ కార్మికునికి నష్టపరిహారం

ప్రజాశ క్తి - తాడేపల్లి

భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నాయకుల అండతో నిర్మాణ కార్మికునికి రూ1.50 లక్షలు అందజేయటం జరిగింది. తాడేపల్లి పట్నానికి చెందిన ఇంటి యజమాని సాంబ శివరావుకు, విజయవాడకు చెందిన మేస్త్రి రాజుకు ఇంటి నిర్మాణ విషయంలో స్పర్ధలు వచ్చాయి. విషయాన్ని మేస్త్రి రాజు స్థానిక సిఐటియు నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. ఇరువురిని కూర్చో బెట్టి యజమాని నుండి నిర్మాణ కార్మికుడు మేస్త్రికి రూ 1.50 లక్షలు ఇప్పించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాజు, స్థానిక నాయకులు మారిన నాగేశ్వరరావు, కోట బాబురావు, జి సుబ్బారెడ్డి, డి కోదండ రామయ్య, పి భాస్కరరావు, శేషగిరిరావు, ఎస్.కె నాగూర్ పాల్గొన్నారు.

ఘనంగా వంకాయలపాటి రవి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - నరసరావుపేట

సామాజిక సేవా చేస్తూ ఎంతో మంది పేదల ఆకలి తీరుస్తున్న పట్టణానికి చెందిన సెంట్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ న్యాయవాది వంకాయలపాటి రవి జన్మదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనపర్తి లోని క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో సుమారు వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించిన్నట్లు అడ్వకేట్ వంకాయ లపాటి రవి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖులు, మిత్రులు, కుటుంబ సభ్యులు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని, మానవ సేవే మాధవ సేవని ఇది నా అదృష్టం గా భావిస్తున్నానని అన్నారు. శుభాకాంక్షలు తెలియ చేసిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.

విషపు జీవులు ఇళ్లల్లోకి వస్తున్నాయి

ప్రజా శక్తి - తాడేపల్లి

ముగ్గు రోడ్డు లోని చర్చి వద్ద కొండపై ప్రాంతంలో విష నాగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్య పెద్ద ఎత్తున ఖాళీ స్థలాల్లో పిచ్చి చెట్లు పెరిగి వేపుగా పెరగడంతో కొండపై ప్రాంతం నుండి పాములు, మండ్రగబ్బలు, తేళ్లు వస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పది అడుగుల పొడవగల భారీ సర్పం ఇళ్ల మధ్య తిరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. పెద్దలు, పిల్లలు బయటికి రావాలంటే నే భయపడుతున్నారని తెలిపారు. ఇళ్ల మధ్య పెద్ద ఎత్తున పెరిగిన పిచ్చి చెట్లను తొలగించాలని మున్సిపల్ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

రూ.32 కోట్ల అదనపు భారం

(మొదటి పేజీ తరువాయి)

పెరగనుందని, అయితే ఇది ప్రతి ఏటా వసూలు చేయటం మరింత ప్రమాదకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల్లో భాగంగానే రాష్ట్రం పన్నుల భారం మోపుతుందని విమర్శించారు. ఈ విషయంలో రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపి ఒకటేనని అన్నారు. రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ భారీగా పన్నులు పెంచుతున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యాలు కల్పించట్లేదని, గుంటూరులో కనీసం త్రాగునీరు కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని విమర్శించారు. అవగాహన కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఎన్.వి.గురుదత్, యుగంధర్, రాధాకృష్ణ, అవధానుల హరి, సదాశివరావు, జి.వెంకటరావు, వివికె.సురేష్, పి.ఎస్.శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిపోల్లో రేషన్ పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

సరుకులు పంపిణీ కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో గతనెల రోజుల నుంచి అవసరమైన అన్ని కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అన్ని దుకాణాల్లో ఈ - పోస్ మిషన్లు, వేయింగ్ మిషన్లు సర్వీసింగ్ చేసి పూర్తిస్థాయిలో సిద్ధం చేశామని, దుకాణాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోని చౌక ధరల దుకాణాల్లో సరుకుల పున్ణపంపిణీ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని సరుకుల పంపిణీని పరిశీలిస్తున్నారన్నారు. వసంతరాయపురంలోని చౌక ధరల దుకాణంలో రైస్‌కార్డుదారులకు సరుకుల పంపిణీ విధానాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ - పోస్‌మిషన్ ద్వారా రైస్‌కార్డుదారుల అథెంటిఫికేషన్ తీసుకొని బ్లూటూత్ అనుసంధానమైన వేయింగ్ స్కేల్ ద్వారా ఖచ్చితమైన తూకంతో సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రముని, తూర్పు మండల తహశీల్దార్ మహబూబ్ సుభాని, సి ఎస్‌డిటి భాస్కర్, చౌకధరల దుకాణం నిర్వహకులు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తర దక్షిణల' కే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు జిల్లాలోని అధికారులతో ఉన్న సంబంధాల నేపథ్యంలో సిఫార్సులు చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అంతేగాక గతంలో వారు గుంటూరులో పనిచేసిన సందర్భంలో స్థానిక వైసిపి నాయకులతో ఉన్న సంబంధాల వల్ల వారు చెప్పిన వారికి బదిలీలు చేస్తున్నారని ఆ శాఖలో పెద్ద దుమారం చెలరేగింది. ఈనేపథ్యంలో భారీగా అవినీతి అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అయినా ఉన్నతాధికారులు ఇంత వరకు స్పందించలేదు. కొన్ని శాఖల్లో కౌన్సెలింగ్ పూర్తికాగా మరికొన్ని శాఖలో ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. బదిలీల జాబితాలను సిద్ధం చేసినా ఇష్టంలేని వారు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉండటంతో వారిని మానసికంగా సిద్ధం చేసి ఉత్తర్వులు ఇవ్వాలని ఉన్నతాది కారులు యోచిస్తున్నారు. విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. వారికి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. ఇతర శాఖలోని ఉద్యోగులకు సంబంధించిన బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగుస్తుంది. అయితే గడువు తక్కువగా ఉండటం వల్ల బదిలీల గడువును పెంచాలని ప్రభుత్వానికి ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలు విన్నవించారు. ఈమేరకు ప్రభుత్వం అంగీకరించిందని ప్రచారం జరుగుతున్నా ఇంకా ఉత్తర్వులు రాలేదని ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

3న వైఎస్ జగన్ తెనాలి రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈనెల 3న తెనాలి రానున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు తెలిపారు. ఆదివారం ఆయన గుంటూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను అపహాస్యం చేస్తూ తెనాలిలో పోలీసులు నడిరోడ్డుపై పట్టపగలు ముగ్గురు దళిత, మైనార్టీ యువకులను హింసించిన ఘటనలో బాధిత కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించనున్నారని తెలిపారు. యువకులను బహిరంగంగా చిత్ర హింసలకు గురి చేసిన అధికారులపై ఇంత వరకు ఎటువంటి చర్యలు లేవన్నారు. ఎవరైనా నేరం చేస్తే చట్టపరంగా కోర్టులో హాజరు పరిచాలని, కోర్టు విచారించి శిక్ష విధిస్తుందని పోలీసులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే కోర్టులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. కూటమి పాలనలో ప్రజాస్వామ్యం లేదా? అధికారులకు చట్టాలు వర్తించవా? అని ప్రశ్నించారు. పోలీసుల హింస చంద్రబాబు, లోకేష్‌కు కన్పించదా అని ప్రశ్నించారు. ఈ ఘటనలో పోలీసుల వైఖరిని ఖండిస్తూ బాధిత కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు వైఎస్ జగన్ మంగళవారం ఉదయం 11 గంటలకు తెనాలి రానున్నారని ఆయన తెలిపారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న సిఐటియు

ప్రజాశక్తి - గుంటూరు

ఐక్యతా, పోరాటం నినాదాలతో 1970 మే 30వ తేదీన ఆవిర్భవించిన సిఐటియు అప్పటి నుండి దేశవ్యాప్తంగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని సిఐటియు గుంటూరు తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ జెండాను నగర ఉపాధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి, జిలాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భవించిన నాటి నుండి పాలకులు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని చెప్పారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందని, లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు తమ హక్కులను పూర్తిగా కోల్పోతున్నారన్నారు. ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.కె మస్తాన్‌వలి మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ జులై 9న జరిగే సమ్మెలో ముఠా కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టింబర్ ముఠా ప్రెసిడెంట్ ఎస్.కె.జిలాని అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీలు వెంకటేశ్వర్లు, హుస్సేను, ముఠా కార్మికులు వలి, హసన్, సైదా, జానీ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు పాల్పడకూడదని మంగళగిరి రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. ఆదివారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఎలాంటి గొడవలకు, భూదందాలకు, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, దౌర్జన్యాలకు, అసాంఘిక చర్యలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు, పాల్పడకూడదని, గ్రామీణ ప్రాంతాలలో విద్వేషాలు సృష్టించకుండా ఉండాలని, అన్ని వివాదాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకట్ హెచ్చరించారు. అలా కాకుండా గొడవలు సృష్టించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తే పిడి యాక్టు కేసులు పెడతామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా రౌడీషీటర్లు, భూ దందాలకు, అసాంఘిక చర్యలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మద్యం షాపు వద్ద వివాదం

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని వినుకొండ రోడ్‌లో గల ఒక మద్యం దుకాణం వద్ద ఆదివారం వివాదం చోటుచేసుకుంది. సిండికేట్ భాగస్వాములు అరుపులు, కేకలతో సిండికేట్ నిర్వహిస్తున్న వ్యక్తిపై గొడవకు దిగారు. ఎనిమిది నెలలుగా సిండికేట్‌లోని భాగస్వాములకు వ్యాపార లావాదేవీలకు సంబంధించి లెక్కలు చూపడం లేదనే కారణంతో ఈ వివాదం చెలరేగినట్లు తెలిసింది. లెక్కలు చూపి మా లాభాలను పంచిపెట్టాలని నిర్వాహకుడిపై భాగస్థులందరూ బాహాబాహికి దిగారు.

కార్డుదారులు సకాలంలో సరుకులను అందుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కార్డుదారులు సకాలంలో రేషన్ సరుకులను అందుకోవాలని తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అన్నారు. ఆదివారం మంగళగిరి మండలం నవులూరు గ్రామంలోని మక్కే వారి పేటలో చౌక ధరల దుకాణం ప్రారంభమైంది. రాష్ట్ర సివిల్ సప్లయి డైరెక్టర్ తోట పార్థసారథితో కలసి టిడిపి నాయకులు రేషన్ సరుకులను కార్డుదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల జయసత్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు నాణ్యమైన రేషన్ సరుకులు అందిస్తుందని కార్డుదారులు గుర్తించి సకాలంలో అందుకోవాలని ఆమె తెలిపారు. టిడిపి గుంటూరు జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు మట్టుకొయ్య శేషగిరి, మర్రి ఏసుబాబు, రుద్ర నాగరాజు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకటరావు, ఆకుల ఉమామహేశ్వరరావు, కొత్త శ్రీనివాసరావు, తోట శ్రీనుబాబు, కొల్లి వెంకటరావు, రుద్ర శ్రీను, మాతంగి బాబురావు, చావలి ఉల్లయ్య, గుమ్మడి కోటేశ్వరమ్మ, మట్టుకోయ్య అశోక్, పైలా రవి, కట్టేపోగు ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైసీపీ మంగళగిరి నియోజకవర్గ ఇన్చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూన్ 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని దుర్మార్గమైన పాలన అందిస్తున్నారని ఆరోపించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నాయకులు పచ్చల రత్నకుమారి, ఈదులమూడి డేవిడ్ రాజు, ఊట్ల పాల శ్రీనివాసరావు, మంగళగిరి మండలం రూరల్ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి గారి కోర్టులో

GW.O.P (H.M.GO.P) No. 517/2025

బిట్వీన్:

1) దేవతి రేఖా రాణి,W/o. వెంకట లక్ష్మి నాగ కిషోర్, 2) దేవతి సాంబ్రాజ్యం W/o. సుబ్బారావు, Both are R/o.ప్లాట్ నెం. 402, యాగంటి రూబి అపార్ట్‌మెంట్సు,పాత పట్టాభిపురం, గుంటూరు. ...పిటీషనర్లు

ఎదిరి

నిల్ ...రెస్పాండెంట్

పై నెంబరు జి.డబ్ల్యు.ఒ.పి.లోని మైనర్ అయిన దేవతి హాసిని 1వ పిటీషనర్‌కు కుమార్తె మరియు 2వ పిటీషనర్‌కు మనవరాలు అయివున్నది. సదరు మైనరు అయిన దేవతి హాసినికి వారసత్వ రీత్యా ఈ దిగువ షెడ్యూలు దాఖలు ఆస్తిలో రాబడిన వాటాను అమ్ముటకు గాను పర్మిషన్ కోరుతూ పై నెంబరు ఒ.పి.లోని పిటీషనర్లు అయిన (1)దేవతి రేఖా రాణి, (2) దేవతి సాంబ్రాజ్యం గార్లు పై నెంబరు జి.డబ్ల్యు.ఒ.పి.ని దాఖలు చేసుకొనియున్నారు. సదరు పై నెంబరు జి.డబ్బు.ఒ.పి.లో ఎవ్వరికైనా, ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నయెడల **ది.30-6-2025న ఉ॥గం॥10-30ని.**లకు పై తెలిపిన కోర్టువారి ఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం తెలియజేయడమైనది.

షెడ్యూలు:గుంటూరు డి॥,నల్లపాడు సబ్ డి॥, గుంటూరు కొత్త మునిసిపల్ కార్పోరేషన్ ఏరియా, అంకిరెడ్డిపాలెం గ్రామం, డి.నెం.208/సి, య.3-43 సెంట్లలోని య.1-10సెంట్లులో 332 1/4 చ.గ.ల స్థలమునకు **హద్దులు.తూర్పు:**తన్నీరు సాంబయ్య మరియు వగైరాల భూమిహద్దు, అ.54.6లు,**దక్షిణం:** దాసరి సుబ్బారావు గారి భూమి హద్దు,అ.54.6లు, **పడమర:** తన్నీరు సూర్య ప్రకాశరావు గారి భూమి హద్దు,అ.54.6లు, **ఉత్తరం:**అ.30ల. వెడల్పు గల బజారు-అ.55.3లు.ఈ హద్దుల మధ్య చ.గ.332 1/4లు సరియగు చ.మీ277.8లు స్థలములో మైనరు దేవతి హాసినికి రాబడిన చ.గ.55.375ల స్థలము.

వాయిదా తేది 30-06-2025.

కొల్లా దుర్గా ప్రసాద్, పిటీషనర్ల తరపు న్యాయవాది, గుంటూరు. సెల్: 9440443200

ఈతతో మెరుగైన అవకాశాలు : సిఐడి ఎస్పీ కె.చక్రవర్తి

ప్రజాశక్తి- తాడేపల్లి

స్విమ్మింగ్ పూల్ లో ఈత నేర్చుకోవడానికి పిల్లలకు అనేక అవకాశాలు ఈరోజు అందుబాటులోకి వచ్చాయని సిఐడి ఎస్పీ కె.చక్రవర్తి చెప్పారు. గత నెల నాలుగో తేదీ నుండి 31వ తేదీ వరకు అమరావతి కర్కటపై ఉన్న ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ప్రాంగణం సమీపంలో కృష్ణ నదిలో పిల్లలకు ఈత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ముగింపు సభ నిర్వహించారు. చక్రవర్తి మాట్లాడుతూ గోకరాజు గంగరాజు గెస్ట్ హౌస్ స్విమ్మింగ్ పుల్ ఈత నేర్చుకునే అవకాశం రావడం పిల్లల అదృష్టంగా భావించాలని తల్లిదండ్రులను కోరారు. స్విమ్మింగ్ పుల్ ల బేసిక్ టెక్నిక్స్ నేర్చుకున్న పిల్లలను ఆక్వా డెవిల్స్ ప్రాంగణములో ఉన్న కీష్ణా నదీలో ఈత నేర్పించటం చాలా గొప్ప విషయమని చెప్పారు. ఓపెన్ వాటర్‌లో స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేయటంతో సముద్రంలో కూడా స్విమ్మింగ్ చేయవచ్చని, ఛానెల్ స్విమ్మింగ్ చేయవచ్చని, తాను రామేశ్వరము లోని ధనుష్కోటి నుండి శ్రీలంక వరకు 36 కి.మి. స్విమ్మింగ్ చేసిన అనుభవాన్ని వివరించారు. గోకరాజు గంగరాజు సారథ్యములో ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ పిల్లలకు ఈత నేర్పించటం ద్వారా సమాజానికి సేవ చేయడము గొప్ప విషయమన్నారు. అధ్యక్షులు లింగిపిల్లి రామకఅష్ణ మాట్లాడుతూ గంగరాజు అసోసియేషన్ కు నది ప్రక్కన ఒక ప్లాట్ డొనేట్ చేయటము వలన ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించబడిందని, అసోసియేషన్ లో స్విమ్మింగ్ పూల్ బాగా చిన్నదైనందున, తమ గెస్ట్ హౌస్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో పిల్లలకు ఉచితంగా ఈత శిక్షణా శిబిరము నిర్వహించుటకు అవకాశమిచ్చినందుకు వారికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమములో అంతర్జాతీయ ఓపెన్ వాటర్ స్విమ్మర్ , ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు అయిన గంధం క్వీనీ విక్టోరియా సన్మానించారు. క్వీనీ విక్టోరియా మాట్లాడుతూ ఓపెన్ వాటర్ స్విమ్మింగ్‌లో ట్రైనింగ్ తాను హైదరాబాద్ నుండి ఆక్వా డెవిల్స్ వచ్చి ప్రాక్టీస్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమములో ఆక్వా డెవిల్స్ సభ్యులు, సీనియర్ అడ్వొకేట్ వెలగా సురేష్ విజయకృష్ణ, సూపర్ బజార్ చైర్మన్‌గా పదవి భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు చిరుసత్కారము చేశారు. శిక్షణ పొందిన పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి యార్లగడ్డ వెంకట రమేష్, ఉపాధ్యక్షులు జి.సాంబశివరావు, సహాయ కార్యదర్శులు ఎ.రామిరెడ్డి , జి.జనార్ధనరావు, కోశాధికారి కె.వి.రామయ్య , ఈవెంట్ కన్వీనర్ సిహెచ్. జోజిబాబు, మాజీ అధ్యక్షులు కె.యస్.రామచంద్రరావు, వెలగపూడి వేంకటేశ్వరరావు , మందపాటి నరసరాజు, కమిటీ సభ్యులు , అసోసియేషన్ సభ్యులు వందలాదిగా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐడి ఎస్పీ చక్రవర్తి

180 రోజు కు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 180 రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో ఎం సుబ్బారావు, బి సూర్యప్రకాష్, బి నవనీతం,ఎం శారద,టీ దుర్గ భవాని, కూర్చున్నారు. ఈ సందర్భంగా కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని ఎసిసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రి గతంలో ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, ఎస్కే జానీ, సారమ్మ, హిమాంబి, సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎప్పుడైనా రేషన్ పొందవచ్చు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఇకనుండి రేషన్ దుకాణాల ద్వారా నెల రోజులు ఎప్పుడైనా రేషన్ పొందవచ్చు అని తాడేపల్లి తాసిల్దార్ డి సీతారామయ్య, ఆర్ ఐ వేదాంత రావు, టిడిపి తాడేపల్లి మండల కార్యదర్శి కొన్ని శేషు తెలిపారు. ఆదివారం ఉదయం పెనుమాక గ్రామంలో ని 3 రేషన్ షాప్ లలో రేషన్ ఇచ్చి కార్యక్రమాన్ని వారి ప్రారంభించారు. రేషన్ డీలర్లు ఎప్పుడు షాపు వద్దే ఉండి రేషన్ ఇస్తారని,65 సంవత్సరాలు పైన ఉన్న వారికి మరియు దివ్యంగు లకు డీలర్లు వారి ఇంటి వద్దకు వచ్చి ఇస్తారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖరరెడ్డి, గ్రామతెలుగుదేశం అధ్యక్షులు పాలెపు వీరేంద్రనాథ్, స్వర్ణలత,తెనాలి మాణిక్యం, పఠాన్ జానీ ఖాన్,ఉయ్యూరు శ్రీనుబాబు,కొరివి రంగబాబు,బాణావత్ నాగరాజు నాయక్,కర్పూరపు నాగేంద్రం,మన్నవ రామారావు, మన్నవ శ్రీనాద్,దాసరి శ్రీనివాసరావు,రేషన్ డీలర్లు మరియు తాడేపల్లి మండల ఐ టిడిపి కోఆర్డినేటర్ నాగార్జున పాల్గన్నారు.

అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని సిపిఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శికంచర్ల కాశయ్య కోరారు.ఆదివారం సాయంత్రం తాడేపల్లి పట్టణంలోని డోలాస్ నగర్, ప్రభు నగర్ ప్రాంతాలలో నివాసం ఉంటున్న పేదల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా కంచర్ల కాశయ్య మాట్లాడుతూ పట్టణాలలో సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వారు ఇల్లు కట్టుకోవడానికి ఐదు లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.సిపిఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య మాట్లాడుతూ సోమవారం మంగళగిరి ఎంటిఎంసికార్యాలయం వద్ద కరిగే ధర్నాను జయప్రదం చేయాలనికోరారు.నియోజకవర్గంలో ఇళ్ళు లేని పేద ప్రజలు పెద్ద ఎత్తున పాల్గని కమిషనర్ కి అర్జీలు ఇద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షేక్ బాషా, రాజు,ప్రసాద్, రాజు,తదితరులు పాల్గన్నారు.

చెత్త తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజా శక్తి - తాడేపల్లి

ఇంకా ఆదివారం ఖాళీ స్థలాల్లో పెరిగిన చెత్త శీర్షిక న ప్రజాశక్తి జిల్లా టాబ్లెట్ లో వచ్చిన కథనంపై ఎంటిఎంసి అధికారులు స్పందించారు. మహాలక్ష్మ చెట్టు, పద్మశాలీయ బజార్ లకు వెళ్లే రోడ్డుకిరువైపులా పెద్ద ఎత్తున పెరిగిన పిచ్చి చెట్లను తొలగించారు.

రోడ్డున పడ్డ డ్రైవర్, హెల్పేర్ కుటుంబాలు

సబ్సిడీగా వస్తున్న రూ. 5,500 పరిస్థితి ఏమిటో?

కిస్తీలు కట్టలెం-సివిల్ పోతుందని వాపోతున్న వాహన యజమానులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఇంటింటికి తిరిగి బియ్యం సరఫరా చేసే యండియు (మొబైల్ డిస్పెన్స రింగ్యూనిట్)యూనిట్ల వాహనాల కూత జూన్ 1వ తారీఖు నుంచి ఆగి పోయింది. డ్రైవర్‌తో సహా దానిపై ఆధారపడిన హెల్పేర్ కూడా రోడ్డున పడ్డారు. పట్టణంలో 18మండలాల పరిధిలో15 వాహనాలున్నాయి అంటే మొత్తం డ్రైవరు హెల్పరుతో కలుపుకొని 66 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇదే మాదిరి రాష్ట్ర మొత్తం 9260 వాహనాలపై ఆధారపడిన డ్రైవర్, హెల్పర్లు 18,500 మంది రోడ్డున పడ్డారు. ప్రతి నెల సుమారుగా రూ.8800 కిస్తీ కట్టాల్సి ఉండగా రూ.5800 సబ్సిడీ రూపంలో ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేస్తే మిగిలిన రూ.3000 వీరికిచ్చే రూ.21వేలల్లో (3000 వేలు డీజిల్ ఆయిల్‌కు, 5000 గుమాస్తాలకు,

నిరుపయోగంగా యండియు వాహనం

3000 కిస్తీలకు,10 వేలు యజమానికి ఉంటాయి. వాహన రిపేర్లు ఇతర ఖర్చులు అన్ని కలుస్తాయి) లు కట్ అవుతుంది. ఇప్పుడు సబ్సిడీ ఎట్లా వేస్తారో తెలియదు. లేదా మొత్తం రూ.8,800 వేలు కట్టాలో తెలియదు. మొత్తం 72 నెల్లు కట్టాల్సి ఉంది. దానిలో ఇంకా18 నెలలు కట్టాలి. ప్రభుత్వంతో అగ్రిమెంట్ కూడా 2027 జనవరి దాకా ఉంది. ఇప్పటి నుంచి కుటుంబపోషణ వాహన కిస్తీ కట్టాల్సి ఉందని డ్రైవర్లు చెబుతున్నారు. కిస్తీలు ఎక్కడి నుంచి తీసుకొచ్చి కట్టాలో తెలియని గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం కట్టాల్సిన సబ్సిడీతో పాటుగా ఇక నుంచి పెండింగ్‌లో ఉన్న కిస్తీ మొత్తం ప్రభుత్వమే కట్టాలని కోరుతున్నారు. లేకుంటే సివిల్ దెబ్బ తిని భవిష్యత్తు అంధకార మవుతుందని ఆందోళన చెందుతున్నారు. ముందస్తు హెచ్చరికలు లేకుండా తీసి వేయటంతో జీవనోపాధిని కోల్పోవటమే కాకుండా కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి సబ్సిడీతో పాటుగా కిస్తీలు కూడా ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలని డ్రైవర్లు కోరుతున్నారు. అదే సమయంలో హెల్పర్లకు ఉపాధి చూపించాలంటున్నారు.

యోగా అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్

యోగాతో ఆరోగ్యం మన చేతుల్లోనే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

యోగాతో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని నిత్యం యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. నరసరావుపేట పట్టణం లోని కలెక్టర్ బంగ్లా రోడ్డులో యోగా స్ట్రీట్‌లో ఆదివారం నిర్వహించిన యోగాంధ్ర 2025 కార్యక్రమాలను పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామన్నారు.జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీ రాణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్న కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. యోగాతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రతి ఒక్కరూ 30 నిమిషాల నుండి నుంచి గంట వరకు యోగా భ్యాసం చేయాలన్నారు. శిక్షణ అనంతరం యోగాను రోజు సాధన చేసి జీవన ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. యోగాలో 1000 మంది వరకు పాల్గొన్నారు.

కొప్పునూరు పొలాల్లో పత్తి విత్తనాలు నాటుతున్న మహిళలు

సాగుకు సిద్ధమవుతోన్న రైతులు

ప్రజాశక్తి - మాచర్ల

ఖరీఫ్‌కు 20 రోజుల ముందుగానే మంచి వర్షాలు పడటంలో మాచర్ల ప్రాంతంలోని రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షం నీరు భూమిలో ఇంకేలా దుక్కులు దున్నుకుని పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు అనుకొన్న దాని కంటే ముందుగా రావటం, బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి వలన వర్షాలు కురుస్తున్నాయి. పత్తి పంటను సాగు చేసుచేసుకొనాలనుకునే రైతులకు ఈ వర్షాలు వరంగా మారాయి. మాచర్ల వ్యవసాయ సంచాలకుని పరిధిలో ఖరీఫ్ సీజన్లో ప్రతి ఏడాది సుమారు 60 వేల ఎకరాలు పత్తి సాగు జరుగుతుందని అంచనా. పత్తి పంటలో తెగుళ్ళు, వైరస్‌లు, వరుసగా ఐదేళ్ల నుండి పత్తి దిగుబడి తగ్గటం వంటి కారణాలతో గత ఏడాది పత్తి పంట సాగు 32 వేల ఎకరాలకు పడిపోయింది. ఈ ఏడాది ఆశాజనకంగా వుంటుందని రైతులు పత్తి విత్తనాలు నాటుతున్నారు. పత్తి విత్తనానికి 2 గ్రాముల థిరమ్‌తో విత్తన శుద్ధి చేయాలని, ఎకరానికి 1 నుండి 1.2 కిలోల విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

హాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - నరసరావుపేట టౌన్

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం వేడుకలతో పాటు"సండేస్ ఆన్ సైకిల్" 25 ఎడిషన్ గుర్తు చేసుకోవడానికి జూన్1వ తారీకున దేశ వ్యాప్తంగా మెగా సైకిల్ ఈవెంట్‌ను నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చటానికి ఎర్త్ హీరో ఫౌండేషన్ వారి భాగస్వామ్యంతో స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మున్సిపల్ స్టేడియం నుంచి గంట పాటు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పర్యావరణం అనుకూలమైన పద్ధతులను ప్రోత్సహించటం ద్వారా ఆరోగ్యకరమైన, చురుకైన జీవన శైలిని పౌరులు అవలంబించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిఎస్డివో నరసింహారెడ్డి, బాస్కెట్ బాల్ కోచ్ చావా శ్రీనివాసరావు, మద్దాల సైదారావు, కేలో ఇండియా పి.ఈ.టి ఇజ్రాయిల్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

గొడవలు వద్దు... కలిసి అభివృద్ధి చేసుకుందాం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

నియోజకవర్గంలో ఇకపై ఎటువంటి గొడవలు లేకుండా కలిసి మెలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహిం చిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడపలో నిర్వహించిన మహానాడు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరి కి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. టిడిపి ఆవిర్భవం నుంచి ఇలాంటి మహానాడు జరగలేదన్నారు. గురజాల నియోజకవర్గంలో 25సంవత్సరాలుగా ఎటువంటి గొడవ లు జరగలేదని ఇప్పుడు బాంబుల సంస్కృతి ఎలా వచ్చిం దని ప్రశ్నించారు. రాజకీయాలలో వ్యక్తిగత దూషణలు ఉండకూడదని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

గురజాల నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ చికిత్స చేయించుకొని ఆర్థిక స్థోమత లేక చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న పేద ప్రజలకు ఆదివారం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

రేషన్ దుకుణాంపై ఫిర్యాదు వస్తే చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం నేటి నుండి నిర్వహిస్తున్న రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 20వ వార్డులో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ప్రజల నుండి ఏ ఫిర్యాదు వచ్చిన చర్యలు తీసుకుం టామన్నారు. ఆర్డీవో మురళీ, మున్సిపల్‌ఛైర్మన్

4న ప్రజా వెన్నుపోటు దినం

చింతలపూడి అశోక్ కుమార్

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా కనీసం 10శాతం హామీలు కూడ అమలు చేయలేక రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైసిపి రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడించిందన్నారు. గతంలో సుగాలి ప్రీతి అంశంలో ఊగిపోయిన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం అయిన ఆ కేసును పట్టించుకోవడం లేదంటే ఇది వెన్నుపోటు కాదా అని ప్రశ్నించారు. సనాతన ధర్మం అంటూ తిరుపతి లడ్డు విషయంలో పాప ప్రక్షాళన పేరుతో గుడిమెట్లు తుడిచిన పవన్ కళ్యాణ్ అదే తిరుపతిలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో తొక్కిసలాట జరిగి భక్తులు మృతి చెందితే ఎందుకు పాప ప్రక్షాళన చేయలేదని ప్రశ్నించారు. ఇది వెన్ను పోటు కాదా అన్నారు. ఈనెల 4వ తేదిన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి దగాపడ్డ ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్, యూత్ అధ్యక్షులు మందా సుధీర్,మాజీ మున్సిపల్ స్టాడింగ్ కౌన్సిల్ సభ్యులు దారా చెన్నయ్య,మాజీ పట్టణ అధ్యక్షులు చింతా రామారావు, పాల్గొన్నారు.

డాక్టర్ పరిటాల సత్యనారాయణకు 2025 ఎన్టీఆర్ స్మారక అవార్డు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నటులు, మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలు ఆదివారం విజయవాడ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో సమాజ సేవకులు, నరసరావుపేట డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ ఏఓ డాక్టర్ పరిటాల సత్యనారాయణ 2025 ఉత్తమ సేవా పురస్కారాన్ని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, శాసనమండలి ఛైర్మన్ బుద్ధ ప్రసాద్, విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా అందుకున్నారు. డాక్టర్ సత్యనారాయణ పరిటాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కొన్నేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విపత్కర కరోన సమయంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు కూడా దగ్గరకు రాని పరిస్థితులలో మృత దేహాలను, అనాథ శవాలకు సైతం దహన సంస్కారాలు నిర్వహించారు. యాచకులకు, నిరాశ్రయులకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజం పట్ల ప్రేమ కలిగి ఉండాలని శక్తి మేరకు నిరాశ్రయులకు అండగా నిలవాలన్నారు. తనకు ఎన్టీఆర్ స్మారక అవార్డు లభించడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. తాను చేపడుతున్న సేవా కార్యక్రమా లలో తనకు సహకరించిన సన్నిహితులకు కృతజ్ఞతలు తెలిపారు. సినీ రంగ ప్రముఖులు, విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యనారాయణను సత్కరిస్తున్న మంత్రి దుర్గేష్, ఇతర ప్రముఖులు

కమలారామ్‌ను సత్కరిస్తున్న అతిథులు

కళారత్న సేవా అవార్డు అందుకున్న కవి కమలారామ్

ప్రజాశక్తి - వినుకొండ

మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో మే 31న త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో కవి కమలారామ్ కళారత్న సేవా అవార్డు అందుకున్నారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జాషువా, సినీ నటుడు పథ్వీరాజ్ , మెగా హెల్పింగ్ అధ్యక్షురాలు శిరీష, డిఎస్పి, బుల్లితెర కళాకారులు వసంత్, నైనిష సమాఖ్య గౌరవ అధ్యక్షులు కమలా రామ్‌ని సత్కరించి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఎండి శిరీష రెడ్డి మాట్లాడుతూ పేరెన్నికగన్న కవులు, కళాకారులను గుర్తించి వారి కళాసేవలకు గాను 2025 - గోల్డ్ స్టార్ సాహితి ప్రతిభ అవార్డులు అందిస్తున్నామని అన్నారు. అన్ని అర్హతలు కలిగి, 40 సంవత్సరాలుగా సాహితీ సేవలు అందిస్తున్న వినుకొండకు చెందిన కమలారామ్‌కు గోల్డ్ స్టార్ కళారత్న అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అవార్డు అందుకున్న కమలారామ్‌ని పలువురు కవులు, మిత్రులు, కళాకారులు, కళా సంస్థలు అభినందించారు. ఈ సందర్భంగా తనను అవార్డుతో గౌరవించిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారికి కమలారామ్ కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చిరొట్టతో భూసారం వృద్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పచ్చిరొట్ట ఎరువుల సాగుతో భూసారం వృద్ధి చెందుతుం దనీ, రబీ సాగు అనంతరం 3వ పంటగా పచ్చి రొట్ట ఎరువుల పెంపకానికి ప్రాధాన్యతనివ్వాలని నరసరావుపేట మండల వ్యవసాయాధికారి వి.నరేంద్రబాబు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నరసరావుపేట మండల పరిధిలో కొందరు రైతులు దాళ్వా సాగు అనంతరం అపరాల సాగు చేపట్టగా, కొందరు రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేస్తున్నారన్నారు. కొందరు రైతులు దాళ్వా నూర్పిడి ఆలస్యం కావడంతో పొలాలను ఖాళీగా ఉంచారని అయితే పెసర, మినుము వంటి అపరాల సాగుకు అవకాశం లేని పొలాలలో రైతులు జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువుల సాగు చేపడితే భూసారం వృద్ధి చెందుతుందని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల సాగు వలన రైజోబ్యూమ్ అనే బ్యాక్టీరియా వృద్ధి చెంది భూసారం పెరుగుతుందని పచ్చిరొట్ట మొక్క వేళ్లనుంచి నత్రజని భూమిలో చేరుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుడులు సాధించవచ్చన్నారు. పచ్చిరొట్ట పైర్లు దాదాపు ప్రస్తుతం ఏపుగా ఎదిగి కలియదున్నే దశలో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట మొక్కలు గట్టిపడితే పొలానికి మేలు కంటే కీడు ఎక్కువగా జరుగుతుందన్నారు. ఈ సమయంలో పచ్చిరొట్ట పైర్లను కలియదున్నాలని, పూత దశకు రాకముందే పచ్చిరొట్ట మొక్కలను కలియదున్నుకోవాలని రైతులకు సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - మాచర్ల

33/11కెవి రైట్ కెనాల్ సబ్ స్టేషన్ నుంచి వస్తున్న 11కెవి ఎల్‌సికె ఫీడర్‌లో రెక్టిఫికేషన్ పనులు నిమిత్తం సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పట్టణ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చెన్నకేశవ స్వామి గుడి, పాతూరు, యాదవుల బజారు, బురుజు, కన్యక పరమేశ్వరి గుడి ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ నియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా సోమవారం, యడ్లపాడు మండలం పరిధిలోని ఉన్నవ మర్రిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని అధికారులు తెలియజేశారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు. ఈ సమయంలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొనే అసౌకర్యానికి చింతిస్తున్నామని, మరమ్మత్తు పనులకు సహకరించాలని చిలకలూరిపేట విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. అశోక్ కుమార్ కోరారు.

ఆర్టీసీ డిపో గాడిన పడేనా..!

ఐదు నుండి 20 లక్షలు రూపాయల వరకు పెరిగిన టోల్ ప్లాజా ఫీజు..

మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్.

డిపోలో నిలిచి ఉన్న బస్సులు

ఆటో గ్యారేజి

ప్రజాశక్తి - మంగళగిరి

అది 1993 ఆగస్టు 15 వ తేదీన మంగళగిరిలో ఆర్టీసీ డిపో ఏర్పడింది. మంగళగిరి కొత్త బస్టాండ్ నుండి 75 సర్వీసులతో ఈ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ బస్సులు సేవలందించాయి. ప్రస్తుతం 34 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. మంగళగిరి పరిసర ప్రాంతాలకు ప్రస్తుతం డిపో నుండి బస్సులు నడపలేని పరిస్థితిలో ఆర్టీసీ సంవత్సరం నుండి మంగళగిరి నుండి అమరావతికి బస్సులు నడపలేని స్థితిలో డిపో అధికారులు ఉన్నారు. గతంలో ఈ రూట్లో ఐదు సర్వీసులు నడిచేది. ఆర్టీసీ సర్వీసులను నిలిపియడం జరిగింది. రాజధాని ప్రాంతంలో రోడ్లు సక్రమంగా లేకపోవడం వలన సర్వీస్ లను నడపలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు అనేకసార్లు తెలిపారు. అయితే మంగళగిరికి అటు గుంటూరు, ఇటు విజయవాడ పెద్దనగరాలు వుండడంతో మంగళగిరి డిపో వేగాన్ని అందుకోలేకపోయింది. మంగళగిరిలో చేతివఅత్తులపై ఆధారపడిన కుటుంబాలే అధికం. దీంతో జీవనోపాధికి ఈ రెండు నగరాలకు అనేకమంది నిత్యం రాకపోకలు సాగించేపరిస్థితి. మరీ ముఖ్యంగా స్వర్ణకారవృత్తిపై ఆధారపడిన స్వర్ణకారులు విజయవాడకు త్వరగా చేరుకోవాలనే లక్ష్యంతో ఆటోలను ఆశ్రయించడం క్రమేణా పెరిగిపోయింది. అదేరీతిలో ఆటోలు ఇబ్బడిముబ్బడిగా పెరగడం... ప్రయాణికులు కూడా ఆర్టీసీ బస్సుకోసం వేచివుండే పరిస్థితి లేకుండా త్వరగా గమ్యం చేరడమే లక్ష్యం కావడంతో ఆటోలకు అటు గుంటూరు, ఇటు విజయవాడ, తెనాలి రూట్లకు కాలక్రమేణా గిరాకీ పెరిగింది. అప్పుడప్పుడు ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నా మంగళగిరి ప్రాంత ప్రయాణికులు మాత్రం ఆటో ప్రయాణానికే ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకుకారణం కూడా లేకపోలేదు. ప్రకాశం బ్యారేజ్ పై భారీ వాహనాల నిషేధం విధించాక.. బస్సుల్లో విజయవాడకు వెళ్లే ప్రయాణికులు అనివార్యంగా ఆటోల వైపు మొగ్గుచూపాల్సిన పరిస్థితి. అలాగే, వ్యక్తిగత వాహనాల సంఖ్య కూడా పెరిగింది. ఈ పరిస్థితుల్లో మంగళగిరి ఆర్టీసీ డిపో అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా డిపోను లాభాల బాట పట్టించలేకపోతున్నారు. ఇక వర్తమానంలోకి వస్తే... మంగళగిరి ఆర్టీసీ డిపో మేనేజరుగా ఆర్.పిచ్చయ్య 2024 అక్టోబర్ 21న ఇక్కడ చార్జి తీసుకున్నారు. ప్రస్తుతం డిపోలో 34 ఆర్టీసీ బస్సులు, 5 హైర్ బస్సులున్నాయి. హైర్ బస్సులు గుంటూరు- విజయవాడ బైపాస్ రూట్లో తిరుగుతాయి. వీటి వల్ల బస్సుస్టాండ్ వద్ద నుంచి వెళ్లే ప్రయాణికులకు ప్రయోజనం లేదు. ఇక శ్రీశైలంకు ఆరు బస్సులు (5సూపర్ లగ్జరీ, ఒకటి ఆల్ట్రా డీలక్స్). ఈ బస్సులు ఉదయం 4.15 గం., 4.50గం, 6.20 గం,7.40గం, 14.30 గం, 20,00గంటలకు మంగళగిరి డిపోనుంచి ప్రారంభమవుతాయి. అలాగే యర్రగొండపాలేనికి రెండు ఎక్స్ ప్రెస్ బస్సులు ప్రయాణిస్తాయి. విజయవాడకు మాత్రం 47వి (16) బస్సులు సిటీసర్వీసులుగా నడుస్తాయి. వీటి పర్యవేక్షణ గవర్నరుపేట, విద్యాధరపురం ఆర్టీసీ డిపోలు చూస్తుంటాయి. ఇక మంగళగిరి ఆర్టీసీ డిపోకు డైలీ రూ.4లక్షలనుంచి రూ.4.50లక్షల వరకూ ఆదాయం లభిస్తుంది. అయితే అంతకు మించి వ్యయం అవుతోంది. మరీ ముఖ్యంగా కాజ టోల్ ప్లాజా ఫీ మంగళగిరి ఆర్టీసీ డిపోకు పెనుభారంగా మారింది. గతంలో నెలకు రూ.4లక్షలనుంచి రూ.5లక్షల వరకు టోల్ ప్లాజాకు కట్టేవారు. గత మే నెల ఒకటో తేదీనుంచి నెలకు రూ.20లక్షలకు పైగానే టోల్ ప్లాజాకు చెల్లించాల్సిరావడంతో మంగళగిరి ఆర్టీసీ డిపో విలవిలాడిపోతోంది. ఇక గుంటూరు- విజయవాడకు 9 బస్సులు, గుంటూరు- మంగళగిరికి 7 బస్సులు, మంగళగిరి- తెనాలికి 6 బస్సులు, వెలగపూడి సచివాలయానికి రెండు బస్సులు, పొన్నూరుకు ఒక బస్సు రాకపోకలు సాగిస్తున్నాయి. మంగళగిరి నుండి గుంటూరు కు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్సు కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. పట్టణ ప్రజలు అనే ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు...

మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్లో ప్రయాణికులు వేచివుండేందుకు అనువైన కుర్చీలు, ఫ్యాన్లు, లైట్లు వున్నాయి. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ వుంది. చిన్నారులకు పాలిచ్చే తల్లులకు మంగళగిరి రోటరీక్లబ్ ప్రత్యేక గదిని వితరణ చేసింది. టాయిలెట్స్‌నూ ఇటీవల మరమ్మతులు చేశారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా టాయిలెట్స్, అలాగే ఓపెన్ టాయిలెట్ కూడా వుంది. బస్సుల సమయపాలన తెలియజేసేందుకుగాను చార్టను అప్ డేట్ చేయడమైనది. సిబ్బందికికూడా పురుషులకు, మహిళలకు వేర్వేరుగా రెస్ట్ రూమ్ లున్నాయి. ఇక బస్సుల మెయింటినెన్స్ విషయానికొస్తే షెడ్యూల్ వన్.. డైలీ చెకింగ్, షెడ్యూల్ టు... వారానికొకసారి, అలాగే షెడ్యూల్ త్రీ.. ప్రకారం బస్సుల కండీషన్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణవుంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదార్ల మరమ్మతులు చేపట్టడంతో కొంత మెయింటినెన్స్ భారం తగ్గింది. ఆర్టీసీ డిపోకు అదనపు ఆదాయం సమకూర్చేందుకుగాను బస్ స్టాండ్ ఆవరణలో వాణిజ్య ప్రయోజనాలకు గాను నెలకు రూ.2.20లక్షల ఆదాయం లభిస్తోంది. మున్ముందు మరింత ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంగళగిరి డిపోకు 50 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించారు. ఇవి ఏసీ బస్సులు కావడంతో ప్రయాణికులకు ఊరటనిచ్చే అంశం. గతంలో హైదరాబాద్ కు మంగళగిరి నుంచి బస్సులు ఒడేవి. అయితే రాష్ట్ర విభజన తర్వాత పరిణామాల్లో ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సు సర్వీసులు రద్దయ్యాయి. పెరిగిన ప్రయాణ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ కు రెండు బస్సు సర్వీసులు కేటాయించాలని డిపో మేనేజర్ గుంటూరు రీజనల్ మేనేజర్ వారికి ప్రతిపాదనలు పంపారు. మంగళగిరి ఆర్టీసీ డిపోకు ప్రస్తుతం అంతకూలంగా లేకపోయినా భవిష్యత్తులో ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు సమకూరితే గాడిన పడుతుందేమో ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు. అదేవిధంగా గతంలో లాగా గ్రామాలకు గతంలో ఆర్టీసీ సర్వీసులు నడిచేవి. వాటిని కూడా పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు.

పన్నుల భారాలపై పోరాటం : నేతాజీ

మాట్లాడుతున్న వై నేతాజీ

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న పన్నుల బారాలపై పోరాటం చేస్తామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. మంగళగిరి సిపిఎం కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మంగళగిరి పట్టణ పార్టీ సభ్యుల, సానుభూతిపరుల విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య అధ్యక్ష వహించారు. నేతాజీ మాట్లాడుతూ గుంటూరు, మంగళగిరి, ప్రకాశం, కృష్ణాజిల్లాలలో ఉన్న విద్యుత్ వినియోగదారులపై స్మార్ట్ మీటర్లు బిగించి భారం మోపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రభుత్వ ప్రయత్నాన్ని ప్రజలను సమీకరించి ఎదుర్కొంటామని అన్నారు. ఇటీవల కాలంలో ఆస్తి పన్ను భారీగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని విమర్శించారు. ఇంటి ఇల్లు ఆధారంగా పనులు పెంచే విధంగా చర్యలు చేపట్టారని విమర్శించారు. గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బగిస్తే పగలగొడతామని చెప్పిన మంత్రి నారా లోకేష్ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించడానికి అనుకూలంగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారిన రాష్ట్రంలో విధానాలు మారలేదని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. బిజెపికి సొంతంగా బలం లేకపోయినప్పటికీ దూకుడు మాత్రం తగ్గలేదని విమర్శించారు. బిజెపి పాలనలో శతకోటీశ్వరుల సంఖ్య రెట్టింపు పెరిగిందని అన్నారు. ఒక శాతం ప్రజల్లో 40% ఆదాయం ఉందని, పేదలైన 50% ప్రజల్లో మూడు శాతం మాత్రమే ఉందని అన్నారు. ఆర్థిక అసమానతలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతుందని అన్నారు. సెస్‌ల పేజరుతో ప్రజలపై భారాలు వేస్తుందని విమర్శించారు. అమెరికా ఆధిపత్యం పెంచుకోవడానికి చూస్తుంది గానీ, అమెరికాలో ఆర్థిక సంక్షోభం పెరిగిపో తుందని అన్నారు. అందువలన రష్యా ఉక్రెయిన్ మధ్య జరిగే యుద్ధాన్ని ఆపాలని ట్రంప్ చూస్తున్నారని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్‌లాల్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు మంగళగిరి పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇళ్లు వేసుకొని నివాసం ఉంటున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తాగునీరు సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి

ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది

పట్టణంలో మలేరియా మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి

మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. నందుల పేట అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిని డాక్టర్ వి.ప్రియాంక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30 వరకు మలేరియా నిర్మూలన మాసోత్సవం జరుగుతుందన్నారు. అధిక జ్వరము, వణుకు, చలి, చెమటలు పట్టటం ,ఒళ్ళు నొప్పులు లక్షణాలని, రక్త పరీక్ష ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చునని, ఎవరైనాపై తెలిపిన లక్షణాలతో బాధపడుతుంటే సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గాని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గాని వైద్యులను సంప్రదించాలన్నారు. ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఎస్ ఉమాకాంత్, ఎ.బాలచంద్రమౌళ, డి.శ్రీనివాసరావు, బి.మల్లేశ్వరరావు, డి.శివ నాగమల్లేశ్వరరావు, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్ బాబు, ఎ. వేణుగోపాలరావు, డి శ్రీనివాసరావు, లెప్రా సొసైటీ కార్యకర్త రమణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభు చందును సన్మానిస్తున్న నన్నపనేని శివాజీ

ప్రభు చందుకు సన్మానం

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక సుందరయ్య కాలనీకి చెందిన కుక్కల ప్రభు చందును ఆదివారం సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ సన్మానించారు. ఈ సందర్భగా శివాజీ మాట్లాడుతూ కుక్కల ప్రభు చందు ఎంతో పేదరికం నుండి కష్టపడి పెదకాకాని హైస్కూల్ నుండి ప్రారంభమైన చదువు విజ్ఞాన యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి ఝార్కండ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ధన్బాదు నుండి పీహెచ్‌డీ పొందటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కుక్కల ప్రభు చందుకి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోటిపల్లి సత్యనారాయణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.బాబురావు, ఉల్లంగులు శివయ్య సాంబయ్య ఆర్.వెంకటేశ్వర్లు ప్రభుచందు కుటుంబ సభ్యులు సుందరయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

ఈతతో ఆరోగ్యం - ఆనందం

ప్రజాశక్తి - తుళ్లూరు


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఈతతో ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని జాతీయ, అంతర్జాతీయ స్విమ్మింగ్ (ఈత)కోచ్ జయప్రకాష్ అన్నారు. కృష్ణానదిలో (రాయపూడి లాంచీ రేవు) 70 మందికి ఆయన స్విమ్మింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శివశక్తి స్విమ్మింగ్ అసోసియేషన్- (రాయపూడి) వారి ఆధ్వర్యంలో సమ్మర్ వెకేషన్‌లో భాగంగా గత 45 రోజులుగా విద్యార్థినీ, విద్యార్థులకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆదివారం శివశక్తి స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రంతో పాటు మెడల్స్ అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని ఎస్ఐ కలగయ్య, శ్రీనివాస్ (ఇంటెలిజెన్స్) పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు. శివశక్తి అసోసియేషన్ అధ్యక్షులు చనుమోలు రమేష్,ప్రధాన కార్యదర్శి కాటా అప్పారావు, కోశాధికారి జమ్ముల కిరణ్, సీనియర్ స్విమ్మర్స్ పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో కలిసి పోస్టరును ఆవిష్కరిస్తున్న విడదల రజని

కూటమి మోసాల్ని ఎండగట్టేందుకే నిరసన

పోస్టర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి–చిలకలూరిపేట

వెన్నుపోటుకు ఆద్యుడు..వెన్నుపోటుకే ఓ ప్రత్యేక దినం అవసరాన్ని తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజని అన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో జూన్ 4వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యాన జరగనున్న 'వెన్నుపోటుదినం' పోస్టర్‌ను పార్టీశ్రేణులతో కలిసి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల మద్దతు తో చేపట్టే నిరసన ర్యాలీను విజయవంతం చేయాలన్నారు. గత సంవత్సరం జూన్ 4న అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'సూపర్‌సిక్స్' పాటు మరో 143 హామీలిచ్చి ఏడాది గడిచినా ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కేవలం ఓట్ల కోసం మాయమాటలు చెప్పి ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. పైగా వాలంటీర్లు, రేషన్ వాహనాల డ్రైవర్ల ఉద్యోగాలు ఊడ గొట్టారన్నారు. కరెంటు బిల్లులు విపరీతంగా పెంచి, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటేలా చేసి సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరిచా రని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే మన రాష్ట్రంలో వినూత్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాల్లో నేరుగా నగదు జమచేసి పారదర్శక పాలన అందించి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా కదిలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బక్క జోజి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి – సత్తెనపల్లి రూరల్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఫణిదం మాజీ సర్పంచ్ బక్క జోజి అన్నారు. జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని అబ్బూరు ఫణిదం నందిగామ గ్రామాల్లో ఆదివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓలేటి కుమారి ,ఓలేటి గురవయ్య తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరి బక్క సుబ్బారావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి

ఆటో డ్రైవర్లకు ఎమ్మెల్యే సూచన

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, తద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ చడలవాడ అరవింద బాబు ఆటో డ్రైవర్లకు సూచనలు చేశారు. ఆదివారం ఎమ్మెల్యే అరవిందబాబు పట్టణంలో పర్యటిస్తున్న సమయంలో ఆటోలో ప్రయాణికులను, డ్రైవర్‌ను పలకరించారు. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు జాగ్రత్తగా తీసుకు వెళ్లాల్సిన బాధ్యత డ్రైవర్ల దేనన్నారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆటోలో నలుగురికి మించి ప్రయాణించ కూడదని ప్రజలకు సూచించారు.

అమ్మో..జూన్ నెల (1వ తారీఖు)..!

తల్లి దండ్రులకు ఫీజులు, రైతులకు పెట్టు బడుల టెన్షన్..

గతం కంటే 25 నుంచి 35శాతం పెరిగిన ఖర్చులు...పెరగని ఆదాయం

ప్రజాశక్తి–చిలకలూరిపేట

నేటి నుంచి జూన్ నెల(1వ తారీఖు) ప్రారంభం కానుంది. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. మధ్య తరగతి ఉద్యోగుల నుంచి రైతులు, సగటు జీవులు తమ పిల్లలను చదివించుకునేందుకు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. రైతుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంది. ఇటు చదువులు, అటు వ్యవసాయ పెట్టుబడులకు ఒకేసారి సొమ్ము సిద్ధం చేసుకోవల్సి రావడంతో తలలు పట్టు కుంటున్నారు. దీంతో జూన్ మాసం అంటేనే సామాన్య, మధ్య తరగతి ప్రజలు హడలిపోతున్నారు....తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్...ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యం ఫీజులు, పుస్తకాలంటు భారీగా బాదేస్తున్నారని వాపోతున్నారు. విద్యాసంస్థల్లో అత్యధికం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫీ'జులుం' ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. పిల్లలకు భవిష్యత్ కోసం తల్లితండ్రులు అప్పులు చేసేందుకూ వెనుకాడటం లేదు. పిల్లల ఫీజులు, పుస్తకాలు, యూనిఫారం కోసం కనీసంగా రూ. 50 వేల నుంచి రూ లక్ష వరకు చేతిలో ఉంచుకోవాల్సి వస్తోంది. పెరిగిన పుస్తకాల ధరలు గతేడాది రూ.60 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాలి రూ.75 పైమాటే. గతేడాది ఆరో తరగతి విద్యార్థు లకు నోటు పుస్తకాలకు, పెన్నులు, అట్టలు వేసే పేపర్లు అన్నీ కలుపుకుని రూ.6,500 వరకు ఖర్చయితే ఈ సంవత్సరం కనీసంగా రూ. 9000 వరకు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. స్కూల్ బ్యాగ్, బూట్లు, లంచ్‌బాక్స్ తదితరాల గురించి చెప్పనక్కర్లేదు. విద్యార్థుల రవాణాకు సంబంధించిన చార్జీలు సైతం యాజ మాన్యాలు పెంచేశాయి. గతేడాది వరకూ ఐదు కిలోమీటర్ల దూరానికి నెలకు రూ.700 తీసుకునే వారు.ఈ ఏడాది రూ.900 వరకూ డిమాండ్ చేస్తున్నారు. గతేడాది ఓ మోస్తరు ప్రయివేటు పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి ఫీజులు రూ.16 నుంచి రూ.20 వేలకు పైగా పెంచారం టున్నారు. ఈ ఏడాది 9, 10 తరగతులకు రూ.30 నుంచి రూ. 40, 45వేలు అడుగుతున్నారు ఇప్పటికే కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల కోసం పిఆర్‌ఒలను, టీచర్లను, తెలిసిన వారిని రంగంలోకి దించాయి. మరికొన్ని యాజ మాన్యాలు నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులకే ఫోన్లు చేస్తూ ముందస్తుగా ఫీజు చెల్లించి అడ్మిషన్ ఖాయం చేసుకోవాలనీ, ఆలస్యం చేస్తే సీట్లు దొరకవని చెప్తున్నారు.

ఆయా విద్యా సంస్థలు అధిక మొత్తంలో వసూలు చేస్తున్న విద్యార్థుల ఫీజుల గురించి విద్యాశాఖాధికారి శ్రీనివాస రావును వివరణ కోరగా విద్యాసంస్థలు నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. ఇప్పటికే అన్ని యాజమాన్యాల విద్యా సంస్థలకు స్పష్టమైన అదేశాలిచ్చా మన్నారు. ఎక్కడైనా ఫీజుల కోసం బలవంతం పెడితే ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా ఫీజులనే వసూలు చేయాలి.

అదనపు భారం

రాగన్న పాలెం..చిలకలూరిపేట గతేడాది మా అన్నాయి. ఆరో తరగ తి ఫీజు రూ11వేలు కట్టాం ఇప్పుడు ఏడో తరగతికి రూ.20 వేలు చెల్లించాలని యాజమాన్యం చెబుతోంది. బస్సు,ఇతర ఖర్చులు ఐదు వేలు ఫీజు రూ. ఎనిమిది వేలు వెరసి ఒక్క సంవత్సరంలో రూ.13 వేలు పెంచారు. పిల్లల చదువులకు అప్పులు చేయాల్సి వస్తోందంటున్నారు. ప్రభుత్వం తూ.తూ.నియంత్రణ చర్యలు చేపట్టకుండా కఠినంగా అమలు చేయలి.

– ఎన్. దుర్గారావు, విద్యార్థిని తండ్రి,

ఆర్థిక తట్టుకోలేకపోతున్నాం

ప్రస్తుత రోజుల్లో పిల్లలను చదివించాలంటే ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాం. ఏడాదికేడాది ఫీజులు పెంచేస్తున్నారు. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం బాధాకరం. ఈ సంవత్సరం పొగాకు వేశాం. పరిస్థితి దారుణంగా ఉంది. భవిష్యత్తు ఆందోళనకరంగా కనిపిస్తోంది. చదువును మధ్యలో ఆపలేక ఖర్చులు భరించలేక సతమతమవుతున్నాం.

– శ్రీరామ్ శ్రీనివాస్ నాయుడు, రైతు, విద్యార్థి తండ్రి.

ప్రజలను వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం : బొల్లా

ప్రజాశక్తి – వినుకొండ

ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో కోటయ్య ప్రభుత్వం ఏడాది గడుస్తున్నా ఒకటి కూడా అమలుపరచకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యవస్థను సర్వనాశనం చేస్తున్నారని, స్కూల్లో మూసేసే పరిస్థితి ఉందన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఈక్రాప్ నమోదులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మిర్చి, పొగాకు, అపరాలు, ధాన్యం పంటలకు గిట్టుబాటు ధర లేక, పంటలను కొనుగోలు చేయకుండా రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. అనేక పథకాలు ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం గద్దెనెక్కాక హామీలు మరిచి ప్రజలను మోసం చేసిందన్నారు. జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినంగా వైసిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, జిల్లా భాగంగా వినుకొండ వైసీపీ ఆఫీస్ నుండి ఆర్టీసీ బస్టాండ్, శివయ్య స్తూపం, మున్సిపల్ కార్యాల మీదగా తాసిల్దార్ కార్యాలయం వద్దకు నిరసన ర్యాలీ జరుగుతుందని, వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలందరూ పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాత విధానంలోనే రేషన్ పంపిణీ

సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

ప్రభుత్వ రేషన్ దుకాణాల ద్వారా ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ప్రజలకు సరైన రీతిలో రేషన్ అందించడం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం పట్టణంలో పలు వార్డులలో ఎమ్మెల్యే పర్యటించారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ జి. కోటేశ్వరరావు, ఆర్డిఓ కె.మధులతతో కలిసి వార్డులలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ దుకాణాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత విధానంలోనే ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేది వరకు రెండు పూటలా రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు : ఆర్డీఓ

రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని రేషన్ డీలర్లపై తహశీల్దార్లు నిఘా ఉంచాలని ఆర్డిఓ కె.మధులత హెచ్చరించారు. ఎమ్మెల్యేతో పాటు రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ లబ్ధిదారుల్లో 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరుకులు అందించాలని చెప్పారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాల్సిందేనన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేయాలన్నారు.

వృద్ధులకు ఇంటివద్దకే రేషన్

ప్రజాశక్తి – సత్తెనపల్లి రూరల్

వృద్ధులకు, దివ్యాంగులకు ప్రతినెల వారి ఇంటివద్దనే రేషన్ సరుకులను పంపిణీ చేయాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ రేషన్ డీలర్లకు సూచించారు. సత్తెనపల్లి పట్టణంలో రేషన్ షాపులను ఆదివారం పున:ప్రారంభించారు అక్రమాలకు పాల్పడే రేషన్ డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్డీవో జీ రమణ కాంతరెడ్డి తహశీల్దార్ చక్రవర్తి టిడిపి నాయకులు యెలినేడి రామస్వామి దరువురి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి – దుర్గి

దుర్గిలోని గాంధీ బొమ్మ సెంటర్లోని ఒకటో నెంబర్ రేషన్ దుకాణాన్ని తహశీల్దార్ ఫనీంద్రకుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కటకం రామారావు జక్కా కొండలు, కె. శ్రీను, వి.శీను, రుద్రాల రవి, సూరి కృష్ణ వేణుగోపాల్ రేషన్ కార్డు దారులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాల్లో సరుకులు పంపిణీ

ప్రజాశక్తి – విజయపురిసౌత్

జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండియూ ఆపరేటర్ల వ్యవస్థతో ప్రజలు నరకం చూశారని టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయపురిసౌత్ లోని రేషన్ దుకాణాల్లో ఆదివారం సరుకులు పంపిణీ పున: ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎండియూ ఆపరేటర్లు రేషన్ సరుకులను పక్కదారి పట్టించారన్నారు. రేషన్ సరుకులు అందక ప్రజలు ఆందోళన చెందారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల సౌకర్యార్థం రేషన్ సరుకులను పారదర్శకంగా దుకాణాల వద్ద పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు,రేషన్ డీలర్లు కట్టా రాజు, శ్రీనివాస్ గౌడ్, ఏసు, రాంచంద్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పాపురంలో...

ప్రజాశక్తి – నాదెండ్ల

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విధానం రేషన్ వాహనాలు రద్దు చేసి. రేషన్ డీలర్ల ద్వారా పంపిణీ చేసే కార్యక్రమం లాంఛనంగా జూన్ 1వ తేదీ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తహశీల్దార్ ఏవి రమణ పాల్గొన్నారు. అప్పాపురం గ్రామంలో రేషన్ షాప్‌ను ప్రారంభించారు. అమీన్ సాహెబ్ పాలెం గ్రామం రేషన్ డీలర్ పూనాటి శ్రీదేవి ఇంటి రేషన్ షాపు ప్రారంభోత్సవం జరిగింది . గ్రామ పంచాయితి సర్పంచ్ కామినేని లలితా నాగేశ్వరావు తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణ చంద్ర రావు పాల్గొన్నారు.

వృద్ధురాలికి సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ

బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు: చీఫ్ విప్ జీవీ

ప్రజాశక్తి – వినుకొండ

పేద ప్రజలకు మేలు చేసేలా ఇకపై రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, అవసరమైన సమయాల్లో ఇతర నిత్యావసరాలు కూడా రాయితీపై అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ సట్టు బజారు, నూజండ్ల మండలం రవ్వారంలో ఆదివారం జరిగిన రేషన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాలు డీసీసీబీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. రేషన్ దుకాణాలను ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మరో కీలక సంస్కరణ తెస్తున్నారని, బియ్యం కావాలంటే బియ్యం, డబ్బులు కావాలంటే డబ్బులు తీసుకునే మార్పు రాబోతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నిర్ణయాన్ని ప్రజలంతా అభినందించడంతో పాటు హర్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డాక్టర్ దాస్తగిరి షకీలా. టిడిపి పట్టణ అధ్యక్షులు పి అయుబ్ ఖాన్. షమీం. కూటమి నేతలు. రాయల్ నాగ శ్రీను. జానీ. తహశీల్దార్ సురేష్ నాయక్. డిటి మురళి. ఆర్ ఐ శ్రీహరి. డీలర్ సంగమేశ్వర రావు పాల్గొన్నారు.

మంచి పరిణామం

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

రేషన్ షాపులు వద్దనే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయడం మంచి పరిణామని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షు లు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. లబ్ధి దారులకు రేషన్ షాపుల వద్దనే రేషన్ పంపిణీ చేయడంతో ప్రజలకు కుదిరిన సమయంలో రేషన్ తెచ్చుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. వృద్ధులు, వికలాం గుల ఇంటికి వెళ్లి రేషన్ పంపిణీ చేస్తారన్నారు.

5న పొగాకు రైతుల ధర్నా

జయప్రదం చేయాలని నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - ఫిరంగిపురం

పొగాకును కొనుగోలు చేయాలని కోరుతూ ఈనెల 5వ తేదీన గుంటూరులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కోరారు. మండలంలోని రేపూడి గొల్లవారిపాలెం గ్రామాలకు చెందిన పొగాకు రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన గుంటూరులో జిపిఐ ఇతర కంపెనీల ముందు పొగాకు కొనుగోలు చేయాలని ధర్నా కార్యక్రమం జరగనున్నదని తెలిపారు. పొగాకు సాగు చేయమని, కొనుగోలు చేస్తామని ఆర్భాటంగా కంపెనీలు ప్రచారం చేశాయన్నారు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటగా పొగాకును సాగు చేశారని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 3.50 లక్షల పైగా పొగాకును సాగు చేయగా గుంటూరు జిల్లాలో 10 వేల ఎకరాలకు పైగా సాగు చేశారని చెప్పారు. సాగు చేసిన రైతుల్లో సన్న,చిన్న కారు, పేద రైతులు అధిక మొత్తంలో ఉన్నారన్నారు. పంట వచ్చి మూడు నెలలు అయినప్పటికీ ఇప్పటివరకు కంపెనీలు కొనకపోవడంతో పొగాకు పాడైపోతుందన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.మూడు నెలల నుంచి ప్రభుత్వంతో, కంపెనీలతో చర్చలు జరిపినప్పటికీ కొంతమేరకు మొక్కుబడిగా తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోతే ప్రభుత్వమైన కొనుగోలు కేంద్రాలు పెట్టి కొనుగోలు చేసి పొగాకు రైతులు ఆదుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం మండల నాయకులు గుంటుపల్లి వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు షేక్ వలి, నాగరాజు ,రంగయ్య, కృష్ణారెడ్డి, కొండయ్య, భూషణం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్

నేటి ధర్నా జయప్రదం చేయాలని మైకు ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు

నల్ల బర్లీ పొగాకును తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ సోమవారం పెదనందిపాడు తాహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున రైతులను పాల్గొనాలని రైతు సంఘం నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు కోరారు. ఆదివారం పెదనందిపాడు, కాకుమాను మండలాలలోని పలు గ్రామాలలో రైతు సంఘం ఆధ్వర్యంలో మైకు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో రైతు సంఘం నాయకులు నల్లమోతు రాజేంద్ర, బాషా పాల్గొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు పెదనందిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని తెలిపారు. ధర్నాలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొంటారని తెలిపారు. నల్ల బర్లీ పొగాకు రైతుల సమస్య పరిష్కారం కొరకు రేపటి ధర్నాలో రైతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని రమేష్‌బాబు కోరారు.

ధనుంజయరావు జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న నన్నపనేని

ప్రజా సేవకుడు గుత్తికొండ ధనుంజయరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి సాహితీ కళా వేదిక కన్వీనర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర చేనేత నాయకులు గుత్తికొండ ధనుంజయరావు ఒక నిబద్ధత గల ప్రజాసేవకుడని ఆంధ్ర నాట కళా సమితి అధ్యక్షులు నాన్నపనేని నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మంగళగిరి నాంచారమ్మ ప్రాంగణంలోని భావనారుషిస్వామి వారి దేవస్థానం వద్ద మంగళగిరి సాహితీ కళావేదిక కోకన్వీనర్ గోలి మధు ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కృష్ణార్జునరావు, మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జొన్నాదుల వరప్రసాదరావు (మనీ) పిరమిడ్ ధ్యాన గురువు ఆకురాతి శంకరరావు, మార్కండేయ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవధ్యక్షులు జొన్నాదుల బాబు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత అందింపుచ్చుకునేందుకు యువ రైతులు ముందుకు రావాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

వ్యవసాయ యాంత్రీకరణ, నూతన సాంకేతికత అందిపుచ్చుకునేందుకు యువ రైతులు ముందుకు రావాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. రైతులకు సమయాన్ని, ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం చూపుతున్న చొరవ ప్రోత్సాహం రైతులు, యువ రైతులు ఉపయోగించుకోవాలి అన్నారు. 9.80 లక్షల విలువ గల వ్యవసాయ డ్రోన్, రైతులు పొందేందుకు బ్యాంకు ఋణ సదుపాయం పొందేందుకు రైతువాటా చెల్లించిన చేబ్రోలు మండలం, శేకూరు గ్రామ శ్రీ స్కంద కిసాన్ డ్రోన్ సిహెచ్‌సి సభ్యులకు వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి పార్టీల నాయకులతో కలసి "కిసాన్ డ్రోన్"(డ్రాగో డ్రోన్స్ క్రిషి 3ప్రో) ఆదివారం అందించారు. యువ రైతుల బలందానికి ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 800 గ్రామస్థాయి కిసాన్ సమైక్యలను ఏర్పాటు చేసి రైతులకు డ్రోన్స్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. కావున రైతు బృందాలు, రైతు సంఘాలు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

"కిసాన్ డ్రోన్" అందిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర

మున్సిపల్ కార్యాలయంలో నేడు పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - తెనాలి

ప్రజా సమస్యల ను నేరుగా తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పురపాలక సంఘ కార్యాలయంలో ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు కమిషనర్ బి.శేషన్న తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించాలని ఆయన కోరారు.

గుండి మెడలో రేషన్ పంపిణీ చేస్తున్న టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్, పెదకాకానిలో రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, మంగళగిరిలో రేషన్ పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

వాడవాడలా డిపోల వద్ద రేషన్ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రేషన్ డిపోలు ప్రజలకు ఎప్పుడైనాఏ సమయంలోనైనా అందుబాటులోనే ఉంటాయని, తెలుగుదేశం తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ అన్నారు. ఎం.టి.ఎం.సి పరిధిలోని గుండి మెడ, చిర్రావూరు గ్రామంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ డిపోలను తెలుగుదేశం నియోజకవర్గ నాయకులు, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు డీలర్లే స్వయంగా ఇంటికి వచ్చి రేషన్ ఇస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల మాజీ జెడ్పీటీసీ దండమూడి శైలజా రాణి, టిడిపి చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, గుండె మెడ గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, మక్కపాటి ఏసు ప్రసాద్, నల్లి బోయిన శ్రీనివాస్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో..

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో రేషన్ దుకాణాలను టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, సీనియర్ నాయకులు కాట్రగడ్డ గోపాలకృష్ణయ్య ప్రారంభించారు.

ప్రజాశక్తి - పెదకాకాని

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందాలని పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక సదాశివా కాలనీలోని, సగరపాలెంలో వున్న రేషన్ దుకాణలలో లబ్ధిదారులకు సరుకులు పంపిణీ కార్యక్రమాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ కాంత్, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళగిరి పట్టణం 8వ వార్డులోని 11వ షాపులో కూటమి నాయకులు ఆదివారం ఉదయం ప్రారంభించారు. పలువురు రేషన్ కార్డు దారులకు కూటమి నాయకులు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావులు మాట్లాడుతూ నాణ్యమైన నిత్యావసర సరుకుల పంపిణీయే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి తహశీల్దార్ రాఘవేంద్ర దినేష్ కుమార్, మంగళగిరి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివాసరావు, నాయకులు బట్టు చిదానంద శాస్త్రి, మాజేటి సూర్య వేణుగోపాలకఅష్ణ శ్రేష్టి, వాకా మాధవరావు, జంజనం వెంకట సుబ్బారావు, జన్నాదుల బాలకృష్ణ, ఆకురాతి లక్ష్మణ్, బీజేపీ నాయకులు మునగాల నాగేశ్వరరావు, చెల్లూరి వీర వెంకట సత్యనారాయణ, డీలర్లు నందిగంటి హనుమాన్ ప్రసాద్, మాజేటి సత్య బాలాజీ, దామర్ల శ్రీను, నవరత్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ఆయుర్వేదంలో ప్రతి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - పెదకాకాని

ఆయుర్వేదంలో ప్రతి ఆరోగ్య సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు.మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలో ఆదివారం శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద హాస్పటల్ వారు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గని వారి సమస్యలకు ఆయుర్వేదంలో దొరికే మందులు గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల శ్రావణి డాక్టర్ పి భాను, డాక్టర్ దగ్గుపాటి మౌనిక, ఆయుర్వేద వైద్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార సలహా సంఘం కమిటీలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడికొండ

ఆహార సలహా సంఘం కమిటీలు ఏర్పాటు చేయాలని తాడికొండ మండల సిపిఎం కార్యదర్శి చింతల భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఆహార సలహా కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయలేదని ఈ ప్రభుత్వ హయాంలోనైనా సమావేశాలు నిర్వహించాలని ఆయన కోరారు. డీలర్ల వద్ద నుండి వినియోగదారులకు సరుకులు కొనుగోలు చేయనున్నగా ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా డీలర్లు సక్రమంగా వినియోగదారులకు పంపిణీ చేయడానికి ఆహార సలహా కమిటీలు ఎంత దోహదం చేస్తాయని ఆయన అన్నారు. కావున వెంటనే మండల స్థాయి ఆహార సలహా సంఘం కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న దేవి ప్రసాద్

పోలీసులకు కోర్టు ద్వారా గుణపాఠం చెబుతాం

ప్రజాశక్తి - తెనాలి

పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తూ తెనాలిలో పోలీసులు ఇష్టానుసారం వ్యవహరించారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవి ప్రసాద్ ధ్వజమెత్తారు. ఇటీవల ఓ కేసులో నిందితులను పోలీసులు శారీరికంగా బహిరంగంగా హింసించిన ఘటనపై స్పందించిన ఆయన నిందితులలో ఒకరైన దోమ రాకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఆదివారం తెనాలి వచ్చారు. రాకేష్ కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించారని, నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచాలి కానీ, బహిరంగంగా శిక్షించే హక్కు పోలీసులకు లేదన్నారు. పోలీసుల చర్యలు రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన పౌరుల ప్రాథమిక హక్కులను హరించటమేనని చెప్పారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఘటనకు బాధ్యులైన టూ టౌన్, త్రీ టౌన్ సీఐలను, కానిస్టేబుల్ కన్నా చిరంజీవిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరఫున హైకోర్టును, అవసరమైతే సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించి పోరాడుతామని, పోలీసులకు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం రామారావు, పిల్లి రాజు నల్లపు నీలాంబరం, చుక్క దేవరాజు, జమ్మి సాల్మన్, జాలాది మోజెస్, బని గల ఆదిమ్మ ఉన్నారు.

పిఎస్ హెచ్‌ఎం పోస్టులు ఎస్‌జిటిలకు ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో 219 మంది జూనియర్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను బలవంతంగా పిఎస్ హెచ్‌ఎంలుగా బదిలీ చేయటం ఆపాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ కోరారు. ఈ మేరకు యుటిఎఫ్ నాయకులు ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుకకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎస్ హెచ్‌ఎం పోస్టులను సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించి భర్తీ చేయాలని కోరారు. అలాగే పిఎస్ హెచ్‌ఎం పోస్టులకు ఎస్‌ఎలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. బదిలీలలో విద్యాశాఖ అధికారులు హడావుడి నిర్ణయాలతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని, కావున అటువంటి చర్యలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిఇఒకు వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, ఎండి.షకీలాబేగం, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, సీనియర్ నాయకులు పి.హనుమంతరావు, చెన్నకేశవరావు, గప్ఫార్, వినోద్ పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత అవగాహన

మినీ మారథాన్‌ను ప్రారంభించిన జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే అనార్థాల గురించి అవగాహన పెంచడానికి, మాదకద్రవ్య రహిత జీవనశైలిని ప్రోత్సహించడానికి నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ తెలిపారు. ఆదివారం నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కోసం నిర్వహించిన మినీ మారథాన్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కోసం జూన్ 1 నుంచి 26వ తేదీ వరకు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు ముఖ్యంగా యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా యువతను భాగస్వామ్యం చేస్తూ మినీ మారథాన్, ర్యాలీలు. సెమీనార్ లు, వివిధ రకాల పోటీలు నిర్వహిస్తు న్నామన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత మాదకద్రవ్యాల వినియో గాన్ని అరికట్టేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని, పోలీస్ శాఖ ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా అవగాహనతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వైద్యారోగశాఖ, విద్యాశాఖ తదితర శాఖలన్ని నిషేధిత మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంతో పాటు వ్యసనాలకు బానిసైన అయిన వారికి డీఎడిక్షన్ సెంటర్లో చికిత్సను అందిస్తున్నా రన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లా డుతూ మాదకద్రవ్యాల వ్యసనాల బారిన పడకుండా యువతకు వాటి వల్ల కలిగే అనర్థాలపై పోలీస్ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ర్యాలీ కలెక్టర్ నుండి నగరంపాలెం, మూడు బొమ్మల సెంటర్ మీదుగా హిందూ కాలేజి వరకూ కొనసాగింది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే నష్టాలను వివ రిస్తూ మినీ మారథాన్‌లో పాల్గొన్న యువకులు, ఉద్యోగులు ప్లే కార్డులను ప్రదర్శిం చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ లక్ష్మి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి సువార్త, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ కల్యాణి, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎస్పీ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, జెవివి నాయకులు

పర్యావరణ దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

పర్యావరణ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బ్రాడీపేట 2/6లోని యుటిఎఫ్ కార్యాలయంలో డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ5, 6, 7 తరగతుల విద్యార్థులకు జూనియర్ విభాంలో, 8, 9, 10 తరగతి విద్యార్థులు సీనియర్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. గాను పోటీలు ఉంటాయని చెప్పారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు మరిత సమాచారం కోసం 97035 79996, 900045 9600, 99480 15701 నంబర్లలో సంప్రదిం చాలని తెలియజేశారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జెవివి నాయకులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, జి వెంకట్రావు, బి.ప్రసాద్, ఎస్ఎం సుభాని, ఎం.ఉదయభాస్కర్, ఎం. హనుమంతరాజు, బి.ప్రతాప్‌సింగ్, ప్రొఫెసర్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

జొమోటో కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుండా యాజమాన్య ప్రతినిధులు కాలయాపన చేస్తూ, సమస్యను జఠిలం చేస్తున్నారని, సమస్యను వెంటనే పరిష్కరించని ఎడల రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు బి.ముత్యాలరావు హెచ్చరించారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జొమాటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని మే 29వ తేదీ నుండి నిరసన తెలియజేస్తున్నారని అన్నారు. కార్మిక శాఖ అధికారి యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించినా యాజమాన్య ప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. సమస్య పరిష్కారం చేయకపోతే జూన్ 2వ తేదీ నుండి గుంటూరు నగరం మొత్తం జొమోటో కార్మికులు అందరూ విధులు నిలుపుదల చేస్తారని, తర్వాత జరిగే పరిణామాలకు యాజమాన్యం ప్రతినిధులే బాధ్యత వహించాలని ముత్యాలరావు అన్నారు. ఈ సమావేశంలో జమోటో ప్రతినిధులు సోగా బ్రహ్మయ్య, క్రాంతి రణదేవ్, మోహన్ పాల్గొన్నారు.

జనాభా నిర్వహణపై సర్వే

అన్ని ప్రాంతాల్లో గ్రామసభలు - క్యూ ఆర్ కోడ్ ద్వారా అభిప్రాయసేకరణ

జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి పి.శేషశ్రీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జనాభా నిర్వహణ విధానంపై సర్వే నిర్వహిస్తున్నట్టు జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి పి.శేషశ్రీ తెలిపారు. జనాభా పెరుగుదల తగ్గడం, కుటుంబ పరిమాణం తగ్గిపోతుండగా వృద్ధుల సంఖ్య పెరగడం వల్ల వచ్చే సమస్యలపై అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మారుతున్న జనాభా గణాంకాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన మార్పులపై ప్రజలనుంచి అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈనెల ఒకటి నుంచి సర్వే ప్రారంభించినట్టు ఆమె వివరించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.

సర్వేలో పొందుపర్చిన అంశాలు?

ప్రస్తుత పరిస్థితుల్లో జనాభా పెరుగుదలకు కృషి జరగాలన్నది ప్రభుత్వ అభిమతం. ఇందులో భాగంగా కుటుంబానికి మద్దతు, మహిళల ఆరోగ్యం, వృద్ధులకు మద్దతు, పట్టణ, గ్రామ సమతుల్యత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, డేటా, పరిపాలన అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకోవాల్సి ఉంది. ఈమేరకు క్యూ ఆర్ కోడ్ ద్వారా కూడా అభిప్రాయాలు పంపవచ్చు. గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయం సేకరించాలని నిర్ణయించాం.

ఈ సర్వే వెనుక ప్రధాన ఉద్దేశ్యం?

భారత దేశ జనాభా పునరుత్పత్తి స్థాయికి దిగువగా ఉన్న కొన్ని రాష్ట్రాలల్లో ఎపి కూడా ఒకటని ప్రభుత్వం గుర్తించింది. వృద్ధిని సమతుల్యం చేయడం, కుటుంబాలను ఆదుకోవడం, భవిష్యత్తును భద్రపర్చడం ప్రభుత్వ ప్రదాన ఉద్దేశ్యం. జనాభా తగ్గుదలపై అత్యవసరంగా అప్రమత్తత లేకపోతే భవిష్యత్తులో అనేక సమస్యలు రావచ్చు. ప్రధానంగా ఆర్థిక మందగమనం, కార్మికుల కొరత, వృద్ధుల సంరక్షణ వ్యవస్థలపై అధిక భారం పడవచ్చు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య అసమానతలు పెరగవచ్చు. ఇందువల్ల దీర్ఘకాలిక జనాభా స్థిరత్వంపై అనేక ప్రశ్నలు ఉత్పన్నం అవుతాయి. ముందస్తు సామాజిక, ఆర్థిక ప్రణాళిక లేకపోతే భవిష్యత్తులో అనేక సమస్యలను చవిచూడాల్సి వస్తుంది.

గ్రామ సభలు ఎప్పటి వరకు జరుగుతాయి?

గ్రామ, వార్డు స్థాయిలో గ్రామ సభలు నిర్వహించాలి. ప్రజలకు క్యూఆర్ కోడ్ ప్రాతిపదికన ప్రభుత్వ ప్రశ్నలకు జవాబులు ఇచ్చేలా సిబ్బంది సూచనలు చేయాలి. ఈసభలను మునిసిపల్, పంచాయతీరాజ్, సచివాలయాల ఉద్యోగులు వీటిని నిర్వహించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించాం. ఈ సభలు 20వ తేదీలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈమేరకు సభలకు హాజరు అయ్యే ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది పాల్గొంటారు.

సర్వే పర్యవేక్షణ ఎవరు చేస్తారు?

జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్ సిఈవో, మండల పరిషత్ అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈమేరకు సోమవారం నుంచి జిల్లా అంతటా సభలు జరుగుతాయి.

ఆ మూడు గ్రామాల్లో యధావిధిగా పంటల సాగు

ప్రజాశక్తి - తుళ్లూరు

2015లో ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయించిన పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురంలో యథావిధిగా పంటలు పండించేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి మరో 44 వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం ప్రకటించడం, అందుకనుగుణంగా స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మూడు గ్రామాల్లో భూసమీకరణ సభలు నిర్వహించడంతో పంటల సాగు పై అయోమయం నెలకొంది. గత నెల 13న హరిశ్చంద్రపురం, 14న వడ్డమాను, పెదపరిమిలో భూ సమీకరణపై గ్రామ సభలు జరిగాయి. ప్రభుత్వం మారితే రాజధాని పరిస్థితి ఏమిటి.. ముందుగా భూములు ఇచ్చిన రైతుల పడ్డ ఇబ్బందులు చూస్తూ ఎలా భూసమీకరణకు ముందుకు వస్తాం..? అని రైతులు ప్రశ్నలు గుప్పించారు. సభ ముగింపులో భూములు ఇచ్చే వారు చేతులు ఎత్తాలని ఎమ్మెల్యే కోరినా ఒక్కరూ చేతులు ఎత్తలేదు. దీంతో మరోసారి గ్రామసభలు పెట్టి చర్చిద్దామని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో గ్రామసభలు జరిగిన గ్రామాల్లో పంటల సాగు ప్రక్రియ కొనసాగుతుందా.. లేదా.. అన్న ప్రచారం జరుగుతోంది. అయితే అత్యధిక మంది రైతులు పంటలు యధావిధిగా పండిస్తామని చెబుతున్నారు. పెదపరిమికి చెందిన రైతు సరిపూడి సాంబశివరావు మాట్లాడుతూ, జూన్ నెల రావడం, వర్షాలు కూడా కురుస్తుండడంతో పంటల సాగు పై దృష్టి సారించామని చెప్పారు. దుక్కులు దున్నడం, చేలల్లో పుల్లలు ఏరి తగులబెట్టడం, విత్తనాలు సిద్ధం చేయడం లాంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారని ఆయన చెప్పారు. ఒకవేళ ప్రభుత్వం భూములు తీసుకోవడం గ్యారంటీ అయినా ఆ ప్రక్రియ పూర్తి అయ్యేందుకు చాలా సమయం తీసుకుంటుందని, అప్పటిదాకా పొలాల్ని ఖాళీగా ఉంచడం ఎందుకని.. ఆయన ప్రశ్నించారు. భూసమీకరణ విషయమై ప్రభుత్వం త్వరలో స్పష్టత నిస్తుందని భావిస్తున్నామని వడ్డమాను రెవెన్యూలో వ్యవసాయ భూములున్న దొండపాడుకు చెందిన రైతు నెలకుదిటి వెంకటేశ్వరరావు చెప్పారు. 2015లో తుళ్లూరు మండల పరిధిలోని పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలను ప్రభుత్వం భూసమీకరణ నుంచి మినహాయించింది. దీంతో అప్పటి నుంచి మూడు గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతి ఏటా మే రెండవ వారం నుంచి రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతారు. చేలల్లో పుల్లలు ఏరి తగుల బెట్టడం, దుక్కులు దున్నడం, విత్తనాలు సిద్ధం చేయడం లాంటి పనుల్లో నిమగ్నమవుతారు. వర్షం కురిస్తే విత్తనాలు నాటే ప్రక్రియ మొదలవుతుంది. పెదపరిమి, వడ్డమానులో పత్తి,మిర్చి అధికంగా సాగవుతుంది. హరిశ్చంద్రపురం కష్ణానదీ తీర ప్రాంత గ్రామం కావడంతో పసుపు, అరటి, కంద, వరి లాంటి పంటలు పండుతాయి. పంటల సాగుకు ఉపక్రమించే సమయంలో భూ సమీకరణ పై గ్రామ సభలు నిర్వహించిన ప్రభుత్వం తదుపరి ఏం చేయబోతోందో స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు.

వడ్డమానులో దుక్కులు దున్నిన పొలం